

ఇన్ఫోసిస్‌కు ఆర్‌జియుకెటి విద్యార్థినులు ఎంపిక

ప్రజాశక్తి - నూజివీడు టౌన్

నూజివీడు ఆర్‌జియుకెటి ఇటీవల ఎపిఐటిఎతో కలిసి నిర్వహించిన నియామక డ్రైవ్‌లో 66 మంది విద్యార్థులు ఇన్ఫోసిస్‌కు ఎంపికయ్యారు. ఎంపికైన వారిలో 50 మంది సిఎస్‌ఇ విభాగం నుండి, 9 మంది ఇసిఇ నుండి, ఏడుగురు ఇఇఇ నుంచి ఉన్నారు. ఈ సందర్భంగా ఆర్‌జియుకెటి రిజిస్ట్రార్, నూజివీడు క్యాంపస్ డైరెక్టర్ ఆచార్య సండ్ర అమరేంద్రకుమార్, పాలనాధికారి డాక్టర్ బి.లక్ష్మణరావు, అకడమిక్ డీన్ డాక్టర్ చిరంజీవి, ఫైనాన్స్ ఆఫీసర్ శ్రీనాథ్, డీన్ ఆఫ్ స్టూడెంట్ వెల్ఫేర్ డాక్టర్ రాజేష్, డాక్టర్ దుర్గాభవానీతోపాటు కెరీర్ డెవలప్‌మెంట్ అండ్ ప్లేస్‌మెంట్ సెల్ డాక్టర్ చింతం నాయుడు, సిఎస్‌ఇ, ఇసిఇ, ఇఇఇ అధ్యాపకులు ఉదయ్, వినోద్, కనక శ్రావణి, భరత్, శ్రీనివాస్ తదితర అధ్యాపకులు ఎంపికైన విద్యార్థులందరినీ అభినందించారు.

ఉలికిపాటు..!

ఏలూరులో 15 మంది మావోయిస్టులను అదుపులోకి తీసుకున్న పోలీసులు

పూర్వ ఘటనలు గుర్తు తెచ్చుకున్న జిల్లావాసులు



మావోయిస్టులను రహస్య ప్రాంతానికి తరలిస్తున్న పోలీసులు

ప్రజాశక్తి - ఏలూరు స్పోర్ట్స్

జిల్లా వాసులు మంగళవారం మధ్యాహ్నం ఒక్కసారిగా ఉలిక్కిపడ్డారు. జిల్లా కేంద్రమైన ఏలూరు నగర శివార్లలో 15 మంది మావోయిస్టులను పోలీసులు అదుపులోకి తీసుకోవడంతో సంచలనం సృష్టించింది. గతంలో ఏజెన్సీ ప్రాంతమైన పోలవరం, బుట్టాయగూడెం, కుక్కునూరు, వేలేరుపాడు మండలాలను మావోయిస్టులు షెల్టర్ జోన్‌గా వినియోగించుకుంటున్నారని తెలియడం తప్ప నగరంలోనే మకాం వేయడం అందరినీ కలవరపాటుకు గురి చేసింది.

మారేడుమిల్లి ఎన్‌కౌంటర్ అనంతరం అందిన సమాచారం మేరకు జిల్లా ఎస్‌పి ప్రతాప్‌శివ కిషోర్ స్వయంగా రంగంలోకి దిగి ఏలూరు నగర శివార్లలోని కెకెఆర్ గ్రీన్‌సిటీ (గేటెడ్ కమ్యూనిటీ)ని సుమారు 150 మంది పోలీసులతో మంగళవారం మధ్యాహ్న సమయంలో చుట్టుముట్టారు. డ్రోన్ సహాయంతో గ్రీన్‌సిటీ పరిసరాలను జల్లెడ పట్టి ఇతర భవనాలకు కొంచెం దూరంలో ఉన్న రెండంతస్తుల భవనంలో మావోయిస్టులు ఉన్నట్లు గుర్తించి ఆ భవనాన్ని ప్రత్యేక పోలీసు బలగాలు చుట్టుముట్టాయి. అదే క్రమంలో గ్రేహౌండ్స్ బలగాలు ఆ భవనంలోకి చొచ్చుకెళ్లి మొత్తం 15 మంది మావోయిస్టులను అదుపులోకి తీసుకున్నారు. వారిలో ఐదుగురు మహిళలు కూడా ఉన్నారు. వారి వద్ద నుంచి 15 ఆయుధాలు స్వాధీనం చేసుకున్నట్లు సమాచారం. వారిని వెంటనే ప్రత్యేక వాహనాల్లో జిల్లా కేంద్రానికి సమీపంలోనే రహస్య ప్రాంతానికి తరలించి విచారిస్తున్నారు. వీరు సుమారు వారం, పది రోజుల నుంచి ఇక్కడ ఉంటున్నట్లు తెలిసింది. ఈ భవనం ఏలూరులోని ఒక ప్రయివేటు కళాశాలలో లెక్చరర్‌గా పని చేస్తున్న వ్యక్తిగా గుర్తించి, అతనిని పోలీసులు అదుపులోకి తీసుకుని విచారిస్తున్నారు.



మావోయిస్టులు బస చేసింది ఈ భవంతిలోనే

మావోయిస్టులు కేవలం షెల్టర్ జోన్‌గా ఉపయోగించుకునేందుకు ఏలూరు వచ్చారా, లేదా పరిసర ప్రాంతాల్లో ఏదైనా విధ్వంసానికి పాల్పడేందుకు వచ్చారా అనే కోణంలో పోలీసులు దర్యాప్తు సాగిస్తున్నారు. ఈ మావోయిస్టులంతా చత్తీస్‌ఘడ్‌కు చెందిన వారిగా గుర్తించారు. ఎటువంటి ప్రతిఘటనా లేకుండానే మావోయిస్టులను పట్టుకోగలగడంతో పోలీసులు సైతం ఊపిరి పీల్చుకున్నారు.

గత ఘటనలు గుర్తు చేసుకున్న జిల్లా వాసులు

మావోయిస్టులు జిల్లాలోని ఏజెన్సీ ప్రాంతాన్ని షెల్టర్‌జోన్‌గా ఉపయోగించుకోవడం గతంలో ఉండేది. ఆ క్రమంలోనే కొన్ని ఘటనలు సైతం చోటుచేసుకున్నాయి. పోలవరం మండలం ఎల్‌ఎన్‌డి పేట వద్ద సాయంత్రం సమయంలోనే పోలీసులకు నక్సలైట్లకు మధ్య కాల్పులు చోటుచేసుకున్నాయి. అలాగే పోలవరం మండలంలో డేరా కొండల్లో జరిగిన ఎన్‌కౌంటర్‌లో ముగ్గురు క్రాంతి దళానికి చెందిన నక్సలైట్లు మృతి చెందారు. గతంలో 2001లో ఏలూరు రైల్వే స్టేషన్‌లో చోటుచేసుకున్న పేలుడు కూడా మావోయిస్టుల వల్లేనని పోలీసులు అప్పట్లో ప్రకటించారు. సికింద్రాబాద్ నుంచి హౌరా వెళ్తున్న రైలు నుంచి రాత్రి సమయంలో దిగిన ప్రయాణికులు నడుచుకుంటూ ట్రాక్ దాటుతుండగా పేలుడు సంభవించి ముగ్గురు మృతి చెందారు. మావోయిస్టులు పేలుడు పదార్థాలు తరలిస్తుండగా ఈ ఘటన జరిగినట్లు నాడు గుర్తించారు.

ఏదేమైనా 15 మంది మావోయిస్టులను పోలీసులు అదుపులోకి తీసుకోవడంతో జిల్లా వాసులు ఉలికిపాటుకు గురయ్యారు.



మాట్లాడుతున్న ఎంపీ పుట్టా మహేష్‌కుమార్

విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవు

దిశ సమావేశంలో ఎంపీ మహేష్‌కుమార్ స్పష్టీకరణ

ఏలూరు ప్రభుత్వాసుపత్రిలో పరిస్థితులపై అసంతృప్తి

రోడ్ల పనులు వేగవంతం చేయాలని ఆదేశం

ప్రజాశక్తి - ఏలూరు సిటీ

అధికారులు విధుల్లో నిర్లక్ష్యం వహించడంపై ఎంపీ పుట్టా మహేష్‌కుమార్ తీవ్ర అసహనం వ్యక్తం చేశారు. ఏలూరు పార్లమెంట్ నియోజకవర్గంలో పని చేస్తున్న అధికారులు విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు తప్పవని స్పష్టం చేశారు. స్థానిక కలెక్టరేట్‌లోని గోదావరి సమావేశ మందిరంలో మంగళవారం ఎంపీ పుట్టా మహేష్ కుమార్ ఆధ్వర్యంలో జిల్లా అభివృద్ధి, సమన్వయ, పర్యవేక్షణ కమిటీ (దిశ) సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ ఏలూరు ప్రభుత్వ ఆసుపత్రిలో సిబ్బంది కొరత, వైద్యం నాణ్యత, మందుల పంపిణీపై తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు. తాను ఆసుపత్రిలో ఆకస్మిక తనిఖీలు నిర్వహించిన సందర్భంగా కేస్‌షీట్‌లో రోజుకు 10 టాబ్లెట్లు ఇవ్వాలని నమోదు చేసినప్పటికీ, ఒక గ్యాస్ టాబ్లెట్ మాత్రమే ఇస్తున్నారని గుర్తించినట్లు తెలిపారు. శానిటేషన్ అత్యంత దారుణంగా ఉందని, పాత కాంట్రాక్టర్లను తొలగించి కొత్తవారిని నియమించాలని సూచించారు. మెడికల్ కాలేజీ ఉద్యోగాల్లో మెరిట్‌కు ప్రాధాన్యం ఇవ్వాలని అధికారులను ఆదేశించారు. దెందులూరు ఎంఎల్‌ఎ చింతమనేని ప్రభాకర్ మాట్లాడుతూ ఆసుపత్రిలో 108 అంబులెన్స్‌లు అందుబాటులో లేవని, డాక్టర్లు ఉన్నా చికిత్స చేయకుండా రోగులను విజయవాడకు రిఫర్ చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. కొల్లేరు ప్రాంత రైతులు వరి సాగు చేసుకునేందుకు మానవతా దృక్పథంతో సహకరించాలని అటవీశాఖ అధికారులకు ఎంపీ మహేష్‌తోపాటు ఆప్కాబ్ ఛైర్మన్ గన్ని వీరాంజనేయులు సూచించారు. జిల్లాలో దెబ్బతిన్న రోడ్లు, ముఖ్యంగా ఏలూరు-జంగారెడ్డిగూడెం, ఏలూరు-చింతలపూడి రోడ్ల పనులను త్వరితగతిన పూర్తి చేయాలని ఎంపీ అధికారులను ఆదేశించారు. ఏలూరు పార్లమెంట్ నియోజకవర్గ పరిధిలోని అన్ని ఆర్‌అండ్‌బి రోడ్ల మరమ్మతులకు అంచనా వ్యయాన్ని ఒకే నివేదికగా తయారు చేసి ప్రభుత్వానికి పంపాలని సూచించారు. రోడ్ల నిర్మాణంలో కాంట్రాక్టర్లు, క్వాలిటీ చెకింగ్ అధికారులు కుమ్మక్కై నాసిరకం పనులు చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ నేపథ్యంలో పర్యవేక్షణను కఠినంగా అమలు చేయాలని కోరారు. ఏలూరు పార్లమెంట్ నియోజకవర్గ పరిధిలో 12 ఆర్‌ఒబిలకు కేంద్రం నుంచి అనుమతులు వచ్చినప్పటికీ పనులు ప్రారంభం కాకపోవడంపై ఎంపీ అధికారులు ప్రశ్నించారు. 2026 మార్చి నాటికి ఆర్‌ఒబిల పనులు తప్పనిసరిగా ప్రారంభించాలన్నారు. నేషనల్ హైవేల్లో రోడ్లు కుంగిపోయి ప్రమాదాలు జరుగుతున్నందున వెంటనే మరమ్మతులు చేపట్టాలని ఎంఎల్‌ఎ చింతమనేని ప్రభాకర్ కోరారు. పార్లమెంట్ నియోజకవర్గ పరిధిలో మొత్తం 62 పరిశ్రమలు ఉన్నప్పటికీ రూ.500 కోట్లకు పైబడిన టర్నోవర్ కలిగిన సంస్థలు కార్పొరేట్ సామాజిక బాధ్యత కింద వినియోగించాల్సిన నిధులను ఖర్చు చేయట్లేదని ఎంపీ తెలిపారు. ఇలాంటి పరిశ్రమలపై చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ఈ సమావేశంలో కలెక్టర్ వెట్రిసెల్వి, ఎంఎల్‌ఎలు బడేటి చంటి, సొంగా రోషన్‌కుమార్, జాయింట్ కలెక్టర్ అభిషేక్ గౌడ్, ఇతర అధికారులు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలని మెప్మా ఆర్‌పిల ఆందోళన



వినతిపత్రం అందిస్తున్న ఆర్‌పిలు

ప్రజాశక్తి - జంగారెడ్డిగూడెం

తమ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ మెప్మా ఆర్‌పిలు సిఐటియు ఆధ్వర్యంలో మంగళవారం స్థానిక మున్సిపల్ కార్యాలయం వద్ద నిరసన తెలిపారు. అనంతరం వారు సిఎంఇ ఎంకె.నాగమణికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా మెప్మా ఆర్‌పిల సంఘం జిల్లా నాయకులు ఎస్‌కె.సుభాషిణి మాట్లాడుతూ కాలపరిమితి సర్క్యులర్ రద్దుపై హర్షం వ్యక్తం చేశారు. అయితే గ్రేడింగ్ విధానంతో ఆర్‌పిలపై వెట్టిచాకిరీ మాదిరిగా ఒత్తిడి పెంచుతున్నారని తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. నెలంతా ఆన్‌లైన్‌లో పనులు చేసినప్పటికీ కేవలం రూ.1,500 మాత్రమే జమవుతుండటం, నెల జీతంగా ఇచ్చేది రూ.8,000 మాత్రమే కావడంతో కుటుంబాలు నెట్టుకొచ్చే పరిస్థితి ఉండటం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఆన్‌లైన్ ఆర్డర్ల పేరుతో పిండి వంటలు, ఇతర ఆహార పదార్థాలకు అనవసర టార్గెట్లు పెట్టడం వల్ల గ్రూపులపై ఒత్తిడి పెరుగుతోందని, నాణ్యత లోపించినా బాధ్యత మాత్రం ఆర్‌పిలపై వేస్తున్నారని ఆమె విమర్శించారు. దీనిపై అధికారులను ప్రశ్నిస్తే సమాధానం ఇవ్వకుండా బెదిరింపులకు పాల్పడుతున్నారని తెలిపారు. క్షేత్రస్థాయిలో పని చేస్తున్న ఆర్‌పిల సమస్యలను గుర్తించి ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించాల్సిన బాధ్యత అధికారులదేనన్నారు. అయితే వారు పట్టించుకోకపోవడం దారుణమన్నారు. గ్రేడింగ్ విధానం, కేసు యాప్‌ను వెంటనే రద్దు చేయాలని, కనీస వేతనాలు అమలు చేయాలని ఆమె డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సంఘం అధ్యక్షులు ఎం.నాగలక్ష్మి, కార్యదర్శి జి.మోహినికుమారి, కోశాధికారి స్వర్ణ, నేతలు వెంకట నీలిమ, అష్రాఫ్, వి.నాగలక్ష్మి, సునీత, విజయదుర్గ, ధనలక్ష్మి, అప్సర, వెంకటలక్ష్మి, స్వప్నలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

నేడు పండుగ వాతావరణంలో 'అన్నదాతా సుఖీభవ'

అధికారులతో కలెక్టర్ కె.వెట్రిసెల్వి టెలి కాన్ఫరెన్స్

ప్రజాశక్తి - ఏలూరు



జిల్లాలో ఈ నెల 19న 'అన్నదాతా సుఖీభవ' కార్యక్రమాన్ని పండగ వాతావరణంలో నిర్వహించాలని జిల్లా కలెక్టర్ కె.వెట్రిసెల్వి అధికారులను ఆదేశించారు. స్థానిక కలెక్టరేట్ నుండి మంగళవారం 'అన్నదాతా సుఖీభవ' కార్యక్రమం నిర్వహణపై అధికారులతో కలెక్టర్ టెలి కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. ఈ నెల 19న రాష్ట్ర ప్రభుత్వం 'అన్నదాతా సుఖీభవ' ద్వారా రైతులకు ఆర్థిక సహాయం అందిస్తుందని, సదరు కార్యక్రమాన్ని జిల్లాలోని అన్ని రైతుసేవా కేంద్రాల్లో పండుగ వాతావరణంలో నిర్వహించాలని, రైతులందరూ ఈ కార్యక్రమంలో భాగస్వాములయ్యేలా అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. ప్రధాని మోడీ, ముఖ్యమంత్రి పాల్గొననున్న 'అన్నదాతా సుఖీభవ' కార్యక్రమాన్ని ప్రత్యక్ష ప్రసారమయ్యేలా చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమానికి స్థానిక ప్రజాప్రతినిధులను ప్రొటోకాల్ ప్రకారం ఆహ్వానించాలన్నారు. ఈ కార్యక్రమంలో పాల్గొనే రైతులు, ప్రజలకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. జిల్లా వ్యవసాయాధికారి హబీబ్‌భాషా, మండల, గ్రామస్థాయి వ్యవసాయాధికారులు పాల్గొన్నారు.

గోదావరి నదిలోకి దిగొద్దు: ఎస్‌ఐ


ప్రజాశక్తి - పోలవరం

పోలవరం గోదావరి తీర ప్రాంతానికి దూరప్రాంతాల నుంచి విహారయాత్రకు వచ్చే పర్యాటకులు గోదావరి నదిలోకి దిగడం మానుకోవాలని పోలవరం ఎస్‌ఐ ఎస్‌ఎస్.పవన్ కుమార్ మంగళవారం ఒక ప్రకటనలో సూచించారు. మొంథా తుపాన్ ప్రభావంతో గోదావరిలో గుంతలు, ఒడుపులు ఏర్పడి నీటి ప్రవాహం ప్రమాదకరంగా మారిందని ఆయన తెలిపారు. ఇవి బయటకు కనిపించకపోవడంతో పర్యాటకులు నదిలోకి దిగితే ప్రమాదాలకు గురై ప్రాణాలు కోల్పోయే ప్రమాదం ఉందని హెచ్చరించారు. పర్యాటకులు జాగ్రత్తగా వ్యవహరించి, నది పరిసరాల్లో ఫొటోలు మాత్రమే తీసుకోవాలని, నదిలోకి మాత్రం దిగొద్దని సూచించారు.

విద్యార్థులు క్రమశిక్షణతో మెలగాలి

ఎపి గ్రంథాలయ పరిషత్ డైరెక్టర్ ఎం.పద్మజ

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్



పద్మజను సత్కరిస్తున్న నిర్వాహకులు

జిల్లా కేంద్ర గ్రంథాలయంలో 58వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాల సందర్భంగా మంగళవారం వివిధ ప్రభుత్వ, ప్రయివేటు విద్యాసంస్థల విద్యార్థులకు వ్యాసరచన, వక్తృత్వం పోటీలు నిర్వహించారు. కార్యక్రమానికి జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి ఎం.శేఖర్‌బాబు అధ్యక్షత వహించారు. ఎపి గ్రంథాలయ పరిషత్ డైరెక్టర్ ఎం.పద్మజ గ్రంథాలయ వారోత్సవాలను పర్యవేక్షించారు. గ్రంథాలయ భవనం స్థితిగతులను, సిబ్బంది కొరతను అడిగి తెలుసుకున్నారు. గ్రంథాలయంలో అన్ని విభాగాలను పరిశీలించారు. పాఠకులకు ఏమైనా పుస్తకాలు అవసరమైతే అధికారులను కలిసి ఇబ్బందులను తెలియజేయాలని సూచించారు. ఈ సందర్భంగా పద్మజ మాట్లాడుతూ విద్యార్థులు క్రమశిక్షణతో మెలగాలని, అప్పుడే విజయానికి చేరువవుతామన్నారు. ప్రతి ఆదివారం నిర్వహించే 'చదవడం మాకిష్టం' కార్యక్రమం గురించి అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆమెను గ్రంథాలయ సిబ్బంది మెమెంటోతో సత్కరించారు. మాజీ ఎంఎల్‌సి రాము సూర్యారావు మాట్లాడుతూ విద్యార్థులకు పలు సూచనలు చేశారు. అనంతరం మధ్యాహ్నం విద్యార్థులకు చిత్రలేఖనం, జనరల్ నాలెడ్జ్‌పై క్విజ్ పోటీలు నిర్వహించారు.

గాలి వేగం బట్టి నష్టం

వ్యవసాయ పరిశోధనా స్థానం సహాయ సంచాలకులు డాక్టర్ టి.శ్రీనివాస్

ప్రజాశక్తి - పెనుమంట్ర

తుపాను సమయంలో వీచే గాలి వేగం బట్టి వరి పంటకు ఏర్పడే నష్టం ఉంటుందని మార్టేరు ప్రాంతీయ వ్యవసాయ పరిశోధనా స్థానం సహాయ సంచాలకులు డాక్టర్ టి.శ్రీనివాస్ అన్నారు. మంగళవారం ఇక్కడ ప్రజాశక్తితో ఆయన మాట్లాడుతూ గత 55 సంవత్సరాల్లో 61 తుపానులు రాష్ట్రంపై ప్రభావం చూపించగా 16 తుపానులు అక్టోబర్ మాసంలోనే వచ్చాయని పేర్కొన్నారు. తుపాను సమయంలో వీచే గాలి వేగం వల్ల వరిలో ఎక్కువగా నష్టం వాటిల్లుతుందని తెలిపారు. గాలివేగం 25 కిలోమీటర్ల కన్నా తక్కువగా ఉంటే పంటపై ఎటువంటి నష్టం ఉండదని, గాలి వేగం 54 - 58 కిలోమీటర్ల మధ్య ఉంటే చేను పడిపోయే అవకాశం ఉందని తెలిపారు. గత మొంథా తుపాను తరువాత వరి పంటపై ఆకు ఎండు తెగులు, మానుకాయ తెగులు ఆశించాయని, ఈ తెగుళ్ల వల్ల వరి పంటపై కలిగే నష్ట నివారణ చర్యల గురించి వ్యవసాయ అధికారులను సమాయత్తం చేయవలసిన అవసరం శాస్త్రవేత్తలపై ఉందని అన్నారు. ఈ దాళ్వా కాలానికి ఎంటియు 1426 అనే చిరుసంచి రకాన్ని, పశ్చిమగోదావరి జిల్లాకు 25 కిట్ల చొప్పున పరిశీలనకు ఇవ్వడం జరుగుతుందని, ఈ రకాన్ని జాగ్రత్తగా పరిశీలించి ఫలితాలను తెలియజేయాలని వ్యవసాయ అధికారులను కోరారు. ఎంటియు 1426 మిక్కిలి సన్న గింజ రకమని, దీని వేయి గింజల బరువు కేవలం 13.25 గ్రాములు మాత్రమేనని తెలిపారు. ఈ రకం ఎండాకు తెగులు, అగ్గి తెగులు, చలి ప్రభావాన్ని తట్టుకుని మంచి దిగుబడులు ఇస్తుందని తెలిపారు. ఈ నెలాఖరుకు ఎంటియు 1121, ఎంటియు 3626 రకాలు మార్టేరు పరిశోధనా స్థానంలో రైతులకు అందుబాటులో ఉంటాయని, కావలసిన రైతులు సంప్రదించాలని కోరారు. ఈ ఖరీఫ్‌లో జిల్లాలో 2.12 లక్షల ఎకరాల్లో వరి సాగు అయ్యిందని, తుపాను తరువాత ఆకు ఎండు తెగులు, మానుకాయ తెగుళ్ల ఆశించి నష్టం కలిగిస్తే, తాడేపల్లిగూడెం డివిజన్ లో 13 వేల ఎకరాల్లో కోతలు పూర్తయ్యాయని, మిగిలిన ప్రాంతాల్లో ఈ నెలాఖరుకు కోతకు వస్తుందని తెలిపారు.

విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉండరాదు

ఎడిఇ కిరణ్‌బాబు

ప్రజాశక్తి - ముదినేపల్లి

మండల ప్రజలకు, రైతులకు, పరిశ్రమలకు విద్యుత్ సరఫరాలో ఎటువంటి అంతరాయం లేకుండా చర్యలు తీసుకోవాలని విద్యుత్ శాఖ గుడివాడ ఎడిఇ ఎ.కిరణ్‌బాబు ఆదేశించారు. ముదినేపల్లి విద్యుత్ కార్యాలయం వద్ద ఆయన గురువారం సిబ్బందితో సమీక్షా సమావేశం నిర్వహించారు. సమావేశంలో కిరణ్‌బాబు మాట్లాడుతూ గ్రామాల్లో పేరుకుపోయిన విద్యుత్ బకాయిలపై సిబ్బంది దృష్టి సారించి వసూలు చేయాలన్నారు. గ్రామాల్లో సోలార్ విద్యుత్ వినియోగం పెంపొందించుకునేలావినియోగదారులను ప్రోత్సహించాలన్నారు. విద్యుత్ వినియోగదారులకు నిరంతర విద్యుత్ సరఫరా ఉండేలా సమన్వయంతో పని చేయాలని సూచించారు. సమావేశంలో ఎఇ బి.పూర్ణచంద్రరావు, విద్యుత్ లైన్‌మెన్లు, సిబ్బంది పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కిరణ్‌బాబు

భీమడోలులో రోడ్డు పనులకు శంకుస్థాపన

ఎంఎల్‌ఎ ధర్మరాజు చొరవతో తీరనున్న జనం కష్టాలు

ప్రజాశక్తి - భీమడోలు

భీమడోలు మార్కెట్ ప్రాంతం నుంచి జంక్షన్ మీదుగా ద్వారకాతిరుమల వెళ్లే యాత్రికుల రహదారి కష్టాలు త్వరలోనే గట్టెక్కనున్నాయి. ఉంగుటూరు ఎంఎల్‌ఎ పత్సమట్ల ధర్మరాజు చొరవతో పరిష్కారం లభించింది. భీమడోలు మార్కెట్ నుంచి ద్వారకాతిరుమల మీదుగా కామవరపుకోట వెళ్లే ఆర్‌అండ్‌బి రోడ్డును గత పుష్కరాల సమయంలో అభివృద్ధి చేశారు. ట్రాఫిక్ పెరగడం, ఇతర కారణాల రీత్యా భీమడోలు సంతపేట నుంచి జంక్షన్ వరకూ 1.80 కిలోమీటర్ల పొడవైన రోడ్డు పూర్తిస్థాయిలో ధ్వంసమైంది. దీనిపై చొరవ తీసుకున్న ఎంఎల్‌ఎ ఇటీవల కాలంలో ఈ రోడ్డు మరమ్మతుకు రూ.పది లక్షలు ప్రత్యేక నిధులు విడుదల చేశారు. పనులు చేసిన తర్వాత కాలంలో కురిసిన వానలు, వచ్చిన వరదల కారణంగా రోడ్డు మరోసారి ధ్వంసమైంది. దీనిపై స్పందించిన ఎంఎల్‌ఎ ధర్మరాజు, ఆప్కాబ్ ఛైర్మన్ గన్ని వీరాంజనేయులు ఆర్‌అండ్‌బి అధికారులు, ఇతర ఉన్నతాధికారులతో చర్చించారు. ఈ మేరకు 1.80 కిలోమీటర్ల పొడవు రోడ్డు అభివృద్ధికి రూ.రెండు కోట్ల అంచనా వ్యయంతో నిధులు మంజూరుకు కృషి చేశారు. స్టేట్‌బ్యాంక్ సమీపంలో ఎడమవైపు 170 మీటర్ల పొడవు, కుడివైపు 230 మీటర్ల పొడవున సీసీ రోడ్డు నిర్మాణానికి నిధులు ప్రత్యేకించారు. ఇదేవిధంగా రోడ్డుకు రెండు వైపులా ఆక్రమణలు తొలగించి, ఆ ప్రాంతంలో మార్జిన్ ఏర్పాటుకు అనుమతులు లభించాయి. మంగళవారం సాయంత్రం ఈ రోడ్డు అభివృద్ధి పనులకు ఎంఎల్‌ఎ ధర్మరాజు, ఆప్కాబ్ ఛైర్మన్ గన్ని వీరాంజనేయులు సంయుక్తంగా శంకుస్థాపన చేశారు. రోడ్డు నిర్మాణం త్వరితగతిన పూర్తి చేయాలని ఆర్‌అండ్‌బి అధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గత పుష్కరాల సందర్భంగా మంజూరైన రూ.50 కోట్లతో భీమడోలు-ద్వారకాతిరుమల రోడ్డు ఆధునికీకరణ పనులు అప్పటి టిడిపి ప్రభుత్వ హయాంలో జరిగాయన్నారు. త్వరలో రానున్న పుష్కరాలను పురస్కరించుకుని ఈ రోడ్డు అభివృద్ధి పనులకు కృషి చేస్తున్నామన్నారు. ద్వారకాతిరుమల దేవస్థానం సహాయ సహకారాలతో రోడ్డు వెంబడి రాత్రి సమయంలోసైతం ద్వారకాతిరుమల కాలినడకన వెళ్లే యాత్రికుల సౌకర్యార్థం ఇప్పటికే ఏర్పాటు చేసిన డివైడర్లలో సెంట్రల్ లైటింగ్ ఏర్పాటుకు చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ఉపాధి హామీ బకాయిల చెల్లింపుతోపాటు మార్చి నెల వరకు బిల్లులను చెల్లించి, రోడ్ల నిర్మాణానికి కృషి చేస్తానన్నారు. దీనికి డిప్యూటీ సిఎం పవన్‌కళ్యాణ్ హామీ ఇచ్చారని తెలిపారు. ఈ కార్యక్రమంలో భీమడోలు ఎఎంసి ఛైర్మన్ గిరి, తహశీల్దార్ రమాదేవి, ఎంపిడిఒ పద్మావతి దేవి, వ్యవసాయ శాఖ సహాయ సంచాలకులు డాక్టర్ ఉషాకుమారి, పొలసానిపల్లి సర్పంచి రహీమా బేగం హసేన, కూటమి నాయకులు పాల్గొన్నారు.



శంకుస్థాపన చేస్తున్న ఉంగుటూరు ఎంఎల్‌ఎ, ఆప్కాబ్ ఛైర్మన్

ఉప్పులూరులో వైరల్ జ్వరాలు

ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న సర్పంచి

ప్రజాశక్తి - ఉండి

వైరల్ జ్వరాలతో మండలంలోని ఉప్పులూరు గ్రామం ఉలిక్కిపడింది. రెండు రోజుల క్రితం నుంచి సుమారు పదిమంది ప్లేట్‌లైట్స్ సమస్యతో బాధపడుతూ వివిధ ఆస్పత్రుల్లో చికిత్స పొందుతున్నారు. దీంతో మంగళవారం ఉప్పులూరు గ్రామంలో యండగండి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యులు డాక్టర్ ఐసి కీర్తన ఆధ్వర్యాన నిర్వహించిన చంద్రన్న సంచార చికిత్స కార్యక్రమంలో సుమారు 30 మంది వైరల్ జ్వరాల బారిన పడినట్లు నిర్ధారణ కావడంతో జిల్లా మలేరియా కంట్రోల్ అధికారి డాక్టర్ క్రాంతి, మలేరియా సబ్ యూనిట్ అధికారి డాక్టర్ ఎఎస్ఎన్.మూర్తి, ఎంపిడిఒ శ్రీనివాస్, డిప్యూటీ ఎంపిడిఒ సిఎస్‌వి.రెడ్డి తదితరులు గ్రామంలో పర్యటించి వివరాలు తెలుసుకున్నారు. దీంతో పలువురు మాట్లాడుతూ గ్రామంలో పారిశుధ్య సమస్య అధికంగా ఉందని దీనివల్ల వైరల్ జ్వరాల బారిన పడినట్లు తెలిపారు. ఇదిలా ఉండగా మూడు రోజుల నుంచి గ్రామ సర్పంచి యర్రా దుర్గారావు, టిడిపి గ్రామ అధ్యక్షులు లోకం సుబ్బారావు భీమవరంలోని ప్రయివేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతుండగా లోకం సుబ్బారావు మంగళవారం సాయంత్రం ఆసుపత్రి నుంచి డిశ్చార్జి అయ్యి ఇంటికి తిరిగివచ్చారు. కాగా దుర్గారావు ఇంకా జ్వరం నుంచి కోలుకోకపోవడంతో ఆసుపత్రిలోనే చికిత్స పొందుతున్నట్లు గ్రామస్తులు తెలిపారు. గ్రామంలోని ఒకరు తాడేపల్లిగూడెం ఏరియా ఆసుపత్రిలో చికిత్స పొందుతుండగా మరొకరు భీమవరం ఏరియా ఆసుపత్రిలోనూ సుమారు ఆరుగురు భీమవరంలోని వివిధ ప్రయివేట్ ఆస్పత్రుల్లో చికిత్స పొందుతున్నట్లు తెలిసింది. దీంతో అప్రమత్తమైన వైద్యాధికారులు గ్రామంలో వైద్య శిబిరం నిర్వహించి నివారణా చర్యలు తీసుకునే పనిలో ఉన్నారు.

వైసిపి దెందులూరు నేతకు రిమాండ్

ప్రజాశక్తి - దెందులూరు

పోతునూరు సొసైటీలో అక్రమాలకు పాల్పడ్డారన్న ఆరోపణలతో అరెస్టు అయిన మాజీ ఛైర్మన్ ధూళిపాళ్ల నాగేంద్రవరప్రసాద్‌కు భీమడోలు కోర్టు 14 రోజుల రిమాండ్ విధించింది. కోర్టు రిమాండ్ ఆదేశాలతో ప్రధాన నిందితుడు ప్రసాద్‌ను పోలీసులు సోమవారం అర్ధరాత్రి సుమారు రెండు గంటల సమయంలో ఏలూరులోని జిల్లా జైలుకు తరలించారు.

డెంగీ జ్వరంతో విఆర్‌ఒ మృతి

ప్రజాశక్తి - పెదవేగి

పెదవేగి మండలం కొప్పాక విఆర్‌ఒ రాజేష్ సోమవారం రాత్రి మృతి చెందారు. కొంత కాలంగా రాజేష్ జ్వరంతో బాధపడుతున్నట్లు తెలిసింది. జ్వరం తీవ్రత ఎక్కువగా ఉండటంతో తొలుత ఏలూరులో ఓ ప్రయివేటు ఆసుపత్రికి, ఆ తరువాత మెరుగైన వైద్యం కోసం విజయవాడలోని ఓ ప్రయివేటు ఆసుపత్రికి తరలించారు. అక్కడ వైద్యులు రాజేష్‌కు డెంగీ జ్వరంగా గుర్తించారని తెలిసింది. రాజేష్‌కు జరిపిన వైద్య పరీక్షల్లో ప్లేట్ లెట్స్ పూర్తిగా పడిపోవడంతో సోమవారం రాత్రి కోమాలోకి వెళ్లి ప్రాణాలు కోల్పోయినట్లు సమాచారం. విఆర్‌ఒ రాజేష్ మృతి పట్ల దెందులూరు ఎంఎల్ఎ చింతమనేని ప్రభాకర్, పెదవేగి ఇన్‌ఛార్జి తహశీల్దార్ భ్రమరాంబ, ఆర్‌ఐ కెవిఎస్.సాధి, పెదవేగి మండల విఆర్‌ఒల అసోసియేషన్ ప్రెసిడెంట్ శ్రీనివాస్, కొప్పాక సర్పంచి పరామర్శ దీక్షితులు తమ ప్రగాఢ సంతాపం ప్రకటించారు. ఇన్‌ఛార్జి తహశీల్దార్ భ్రమరాంబ, ఆర్ఐ సాధి సహచర విఆర్‌ఒలు రాజేష్ స్వగ్రామమైన దెందులూరు మండలం దోసపాడు వెళ్లి రాజేష్ మృతదేహానికి నివాళులర్పించారు.

అసైన్డ్ భూములకు రక్షణ కల్పించాలి

ఎపి వ్యకాస ఆధ్వర్యాన నిరసన

ప్రజాశక్తి - ఏలూరు

రాష్ట్ర ప్రభుత్వం పేదలు, దళితుల పట్ల నిరంకుశంగా వ్యవహరిస్తుందని ఎపి వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి పి.రామకృష్ణ విమర్శించారు. ఈ మేరకు స్థానిక పాత బస్టాండ్ సమీపంలోని అంబేద్కర్ విగ్రహం వద్ద నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి పి.రామకృష్ణ మాట్లాడుతూ అసైన్డ్ భూముల (ఫ్రీహోల్డ్)పై ఉన్న నిషేధాన్ని ఎత్తివేసేందుకు రాష్ట్ర ప్రజలకు తీపి కబురు చెబుతామని ఈ నెల పదోతేదీన మంత్రివర్గ ఉపసంఘం ప్రకటించడాన్ని తీవ్రంగా ఖండించారు. పేదలు, బడుగు, బలహీన వర్గాలు, దళితులకు ఉపయోగపడేవే అసైన్డ్ భూములను అభివృద్ధి పేరుతో బలవంతంగా భూసేకరణ చేస్తూ పేదల దళితుల ఉన్న ఎకరా, అరెకరా భూములను లాగేసుకోవడం దుర్మార్గమన్నారు. రానున్న కాలంలో ఎస్సైన్డ్ భూముల రక్షణ కోసం ప్రజాస్వామ్యంగా అన్ని ప్రజాసంఘాలను, దళిత సంఘాలను, కార్మిక ఉద్యోగ సంఘాలను, మేధావులను కలుపుకుని పెద్ద ఎత్తున ఆందోళన పోరాటాలు సన్నద్ధమవుతామని ప్రభుత్వాన్ని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు తామా ముత్యాలమ్మ, జిల్లా నాయకులు ఎం.జీవరత్నం, ఎస్.మహంకాళి, జి.వెంకట్రావు, జిల్లా కమిటీ సభ్యులు కోటేశ్వరరావు, ఎస్.రాజశేఖర్, ఎ.ప్రభాకర్, మాధవ్, హెూలీ మేరీ, వర్మ శ్రీనివాస్, భూముల కోల్పోయిన పేదలు బాలస్వామి, సుబ్బారావు, కృష్ణ, రంగారావు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా పురుషుల దినోత్సవం

ప్రజాశక్తి - ముసునూరు

మండల పరిధిలోని చెక్కపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పురుషుల దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయులు అల్లా భక్షు మాట్లాడారు. ఇన్‌ఛార్జి ప్రధానోపాధ్యాయులు మురారి శివనాగమణి, స్టాఫ్ సెక్రటరీ పద్మ కిషోర్ మాట్లాడారు. పురుష ఉపాధ్యాయులకు ఫన్నీ గేమ్స్, ట్రూత్ అర్ డేర్ వంటి కార్యక్రమాలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందించారు. అనంతరం పురుష ఉపాధ్యాయులను మహిళా ఉపాధ్యాయులు ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు గుడిమెట్ల వెంకాయమ్మ, మురళీకృష్ణ, మాధవి, రుక్మిణి, యోగితా విద్య, ప్రియాంక, కిరణి, కీర్తి, ఫరీదా పాల్గొన్నారు.

పాడి అభివృద్ధికే పశు వైద్య శిబిరాలు

పశుసంవర్ధక శాఖ ఎడి డాక్టర్ డివి.వరప్రసాద్

ప్రజాశక్తి - ముదినేపల్లి



మందులు అందిస్తున్న ఏడి వరప్రసాద్

పాడి పరిశ్రమ అభివృద్ధికి ప్రభుత్వం పశు వైద్య శిబిరాలను నిర్వహిస్తుందని మండలపశుసంవర్ధక శాఖ ఎడి డాక్టర్ డివి.వరప్రసాద్ అన్నారు. మండలంలోని పెయ్యేరులో మంగళవారం పశువైద్య శిబిరం నిర్వహించారు. పశు సంవర్ధక శాఖ, పశు గణాభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ శిబిరంలో గర్భ కోశ వ్యాధులకు, ఎదకు రాని పశువులకు చికిత్స చేశారు. ఈ పశు వైద్య శిబిరంలో పశుపోషకులకు ఎలక్ట్రా మినరల్ మిశ్రమం, ఇతర మందులు ఉచితంగా అందించారు.

పలు గ్రామాల్లో 'పొలం పిలుస్తోంది'

ప్రజాశక్తి - జీలుగుమిల్లి

మండల వ్యాప్తంగా రైతుల ఖాతాల్లో సిఎం కిసాన్,అన్నదాత సుఖీభవ నగదు జమ కానున్నట్లు మండల వ్యవసాయ శాఖాధికారి గంగాధర్ తెలిపారు. మండలంలోని దర్భగూడెం, స్వర్ణవారిగూడెం గ్రామాల్లో ఉద్యానవన శాఖాధికారిణి ప్రసన్నతో కలిసి పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని నిర్వహించినట్లు తెలిపారు. ఈ సందర్భంగా ఎఒ గంగాధర్ మాట్లాడుతూ పంటల్లో రసాయన ఎరువులను తగ్గించి సేంద్రీయ ఎరువులను వాడాలని రైతులకు సూచించారు.

ఆగిరిపల్లి :వరి రైతులందరూ ప్రభుత్వ ప్రమాణాలను అనుసరించి, వరి పంటను కోసిన తర్వాత పూర్తిగా ఆరబెట్టి తేమ శాతం 17 లోపు ఉండేటట్లు చూసుకుని ప్రభుత్వ మద్దతు ధర పొందాలని ఆగిరిపల్లి మండల వ్యవసాయాధికారి జి.భవాని కోరారు. మండల పరిధిలోని పిన్నాగిరిపల్లిలో మంగళవారం నిర్వహించిన పొలం పిలుస్తోంది కార్యక్రమంలో ఆమె పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో పలువురు రైతులు పాల్గొన్నారు.

రూ.1.20 కోట్లతో తాగునీరు సరఫరా

ప్రజాశక్తి - నూజివీడు టౌన్

మండలంలోని యనమదల గ్రామ సచివాలయంలో మంగళవారం సుజల గ్రామ సంవాద్ సమావేశం నిర్వహించారు. రూరల్ వాటర్ సప్లై డిఇ యు.సురేష్‌బాబు మాట్లాడుతూ యనమదల గ్రామంతో పాటు మిగిలిన 12 గ్రామాలకు సంబంధించి జల జీవన్ మిషన్ (జెజెఎం)లో జరిగిన అభివృద్ధి పనులపై వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించినట్లు చెప్పారు. గ్రామంలో రూ.1.20 కోట్లతో జెజెఎంలో అందరికీ సురక్షిత నీటి సరఫరా పథకం అమలు చేసినట్లు వివరించారు.

నేరాలు - ఘోరాలు

సెల్‌ఫోన్ల చోరీ కేసులో ఇద్దరు అరెస్టు

రూ.2 లక్షల విలువైన ఫోన్లు స్వాధీనం

ప్రజాశక్తి - నూజివీడు టౌన్

సెల్‌ఫోన్ చోరీ కేసులో పోలీసులు ఇద్దరిని అదుపులోకి తీసుకుని వారి వద్ద నుంచి చోరీకి గురైన సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు. పట్టణంలోని రూరల్ సర్కిల్ కార్యాలయంలో డిఎస్‌పి కెవివిఎన్‌వి.ప్రసాద్ మంగళవారం విలేకర్ల సమావేశం నిర్వహించి వివరాలు వెల్లడించారు. సబ్ డివిజన్ పరిధిలోని చాట్రాయిలో ఈ ఏడాది అక్టోబర్ 16, 17 తేదీల్లో సెల్‌ఫోన్ షాపుల్లో గుర్తు తెలీని వ్యక్తులు చోరీ చేసినట్లు బాధితులు ఫిర్యాదు చేశారు. ఫిర్యాదు మేరకు చాట్రాయి ఎస్ఐ రామకృష్ణ, నూజివీడు రూరల్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ రామకృష్ణ ఆధ్వర్యంలో పోలీసు సిబ్బంది ప్రత్యేక బృందాలుగా విడిపోయి చోరీ జరిగిన సెల్ ఫోన్ల కోసం దర్యాప్తు చేపట్టారు. ఈ కేసులో ఏలూరు పాములదెబ్బకు చెందిన ముంగి సాగర్‌ను, మరో బాలుడిని అదుపులోకి తీసుకుని వారి వద్ద నుంచి ఎన్‌టిఆర్ జిల్లా పరిధిలో ఉన్న విస్సన్నపేట పోలీస్ స్టేషన్‌కు చెందిన పది సెల్‌ఫోన్లు, చాట్రాయిలో చోరీ జరిగిన 25 సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు. సుమారు రూ.రెండు లక్షల విలువైన సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు. ఈ కేసును చాకచక్యంగా ఛేదించిన పోలీసు సిబ్బందికి రివార్డులు అందించనున్నట్లు వివరించారు.

నాటు సారా స్వాధీనం

పోలవరం :ప్రొహిబిషన్, ఎక్సైజ్ సిబ్బంది మంగళవారం ప్రత్యేక దాడులు చేశారు. గుటాల పరిధిలోని మహాలక్ష్మీదేవిపేటలో నాటు సారా నిల్వ ఉంచిన నేతల నరేష్‌ను అదుపులోకి తీసుకుని అతని వద్ద నుంచి రెండు లీటర్ల నాటు సారా స్వాధీనం చేసుకున్నారు. నరేష్‌ను రిమాండ్‌కు తరలించారు.

బాలల హక్కులపై అవగాహన

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

దళిత బహుజన రిసోర్స్ సెంటర్ ఆధ్వర్యంలో ఏలూరు వైఎస్ఆర్ కాలనీలో బాలల హక్కులపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆంధ్రప్రదేశ్ స్కూల్ టీచర్స్ అసోసియేషన్ రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడు జిజెఎస్వెన్ మాట్లాడుతూ బాలల హక్కుల గురించి వివరించారు. డ్రీస్ ఇండియా స్వచ్ఛంద సంస్థ అధ్యక్షులు డిడ్ల యాంజిలో మాట్లాడుతూ ప్రభుత్వం అనేక హక్కులు బాలలకు కల్పిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో లయన్స్ క్లబ్ సభ్యులు కృష్ణారావు, తదితరులు పాల్గొన్నారు.

సిఆర్‌పిలకు శిక్షణ

ప్రజాశక్తి - చింతలపూడి

మండలంలోని ఎర్రవల్లి ఎన్‌డబ్ల్యుపిసి షెడ్డులో సిఆర్‌పిలకు తడి, పొడి చెత్తను వేరుచేసి పంచాయతీల నుంచి సేకరించడానికి అవగాహన కల్పించేందుకు చింతలపూడి ఎంపిడిఒ కార్యాలయం వద్ద శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ శిక్షణ కార్యక్రమంలో డిపిఆర్‌సి కో-ఆర్డినేటర్ ప్రసంగరావు, డిఎల్‌పిఒ సుందరి, చింతలపూడి ఎంపిడిఒ కెపి.కామేశ్వరి, లింగపాలెం డిప్యూటీ ఎంపిడిఒ సుందరి, తదితరులు పాల్గొన్నారు.

సర్వీస్ రిజిస్టర్ అందజేత

ప్రజాశక్తి - మండవల్లి

క్రమశిక్షణతో కూడిన విద్యను నేర్పించి విద్యార్థుల ఉజ్వల భవిష్యత్తుకు మంచి బాటలు వేయాలని డెమొక్రటిక్ పిఆర్‌టియు రాష్ట్ర ఉపాధ్యక్షులు జివిఎస్.రామాంజనేయులు తెలిపారు. 2025 డిఎస్‌సి ద్వారా నూతనంగా చేరిన ఉపాధ్యాయులకు సర్వీస్ రిజిస్టర్‌ను మంగళవారం ఆయన చేతుల మీదుగా అందించారు. ఈ కార్యక్రమంలో మహిళా కార్యదర్శి లక్ష్మీకాంతం, పాఠశాల ప్రధానోపాధ్యాయులు భాగ్యలక్ష్మి, ఉపాధ్యాయులు, తదితరులు పాల్గొన్నారు.

కెజిబివి హాస్టళ్లలో తనిఖీలు

ప్రజాశక్తి - కుక్కునూరు

మండలంలోని కుక్కునూరు, వెలేరు ప్రాంతాల్లో ఉన్న కెజిబివి హాస్టళ్లను జిసిడిఒ నవీన్ ఆకస్మికంగా సందర్శించారు. వారంలో ఒకసారి హాస్టళ్లను పర్యవేక్షించే కార్యక్రమంలో భాగంగా చేసిన ఈ సందర్శనలో ఆయన విద్యార్థినులతో స్నేహపూర్వకంగా మమేకమై, వారి అవసరాలను అడిగి తెలుసుకున్నారు. మిడ్‌డే మీల్ మెనూ తప్పనిసరిగా అమలు చేయాలన్నారు. ఒకేషనల్ వింగ్‌కు సంబంధించిన అన్ని రికార్డులు, రిజిస్టర్లను పరిశీలించి, మరింత మెరుగైన వాతావరణం కోసం దిశానిర్దేశం చేశారు.

మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండాలి

ప్రజాశక్తి - మండవల్లి

విద్యార్థి దశ నుంచి మాదకద్రవ్యాలపై అవగాహన పెంచుకుని మాదకద్రవ్యాలకు దూరంగా ఉండాలని ప్రధానోపాధ్యాయులు బి.స్వర్ణకుమార్ స్పష్టం చేశారు. మండలంలోని ఇంగిలిపాకలంక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలోని విద్యార్థులు మంగళవారం నాషా ముక్త్ భారత్ ప్రతిజ్ఞ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ దేశ భవిష్యత్తు యువతపై ఆధారపడి ఉందన్నారు. యువత మాదక ద్రవ్యాలకు దూరంగా ఉంటూ భారతదేశ అభివృద్ధికి పాటుపడాలని తెలిపారు. అనంతరం ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.

'కూటమి హయాంలో పెరిగిన దాడులు'

ప్రజాశక్తి - కామవరపుకోట

సిఎం చంద్రబాబు నాయకత్వంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకొచ్చాక ఎస్‌సి, ఎస్‌టి, బిసి మైనార్టీలపై దాడులు పెరిగిపోయాయని సిపిఐ మండల కన్వీనర్ టివిఎస్.రాజు అన్నారు. ఎస్‌సి, ఎస్‌టి, బిసి మైనార్టీలపై దాడులకు నిరసనగా సిపిఐ ఆధ్వర్యంలో కామవరపుకోట తహశీల్దార్ వద్ద మంగళవారం నిరసన తెలిపారు. అనంతరం తహశీల్దార్ ఎలీషాకు వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా టివిఎస్.రాజు మాట్లాడారు. ఈ కార్యక్రమంలో మండల కార్యవర్గ సభ్యులు యడ్లపల్లి రఫా, ఏలేటి రాములమ్మ, ఎఐటియుసి నాయకులు బాలిన రమణారావు, తదితరులు పాల్గొన్నారు.

పిఆర్‌సిని నియమించాలి

ముసునూరు : ప్రభుత్వ ఉద్యోగులకు మధ్యంతర భతిని 30 శాతం శాతం వెంటనే రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించాలని, పిఆర్‌సి కమిటీని నియమించాలని రాష్ట్ర ఉపాధ్యాయ సంఘం (ఎస్‌టియు) మండలాధ్యక్షులు జివి.రత్నం అన్నారు. మండలంలో రాష్ట్ర ఉపాధ్యాయ సంఘం సభ్యత్వ కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా జివి.రత్నం మాట్లాడుతూ ప్రభుత్వ ఉద్యోగులకు రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన హామీలను వెంటనే నెరవేర్చాలని కోరారు. చింతలవల్లి, అక్కిరెడ్డిగూడెం, రమణక్కపేట, సూరేపల్లి, లోపూడి, గుళ్లపూడి, వలసపల్లి, చెక్కపల్లి గ్రామాలోన్లి ఉపాధ్యాయుల సభ్యత నమోదు కార్యక్రమాన్ని పూర్తి చేశారు. ఈ కార్యక్రమంలో మండల ప్రధాన కార్యదర్శి కొప్పుల బాబూరావు, మండల ట్రెజరర్ కె.నాగరాజు, మండల కార్యదర్శి ఎం.రవికిరణ్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

తెలంగాణ ధాన్యానికి చింతలపూడిలో ట్రక్‌షీట్

సొమ్ము చేసుకుంటున్న దళారులు

ప్రజాశక్తి - చింతలపూడి



చింతలపూడి సరిహద్దు అయిన తెలంగాణ నుంచి ధాన్యం తీసుకొచ్చి చింతలపూడిలో ట్రక్‌షీట్ కొట్టించి దళారులు కాసులు చేసుకుంటున్నారు. దమ్మపేట, గంగారం చుట్టుపక్కల నుంచి ధాన్యం తీసుకొచ్చి మండలంలోని రాఘవపురం, యండపల్లి చుట్టుపక్కల ప్రాంతాల్లో దళారులు ట్రక్ షీట్ కొట్టించి వ్యాపారం చేసుకుంటున్నారు. ధాన్యం ఎక్కడ నుంచి వస్తుందో, రోజుకు ఎన్ని లారీలు లోడు అవుతున్నాయో ఆర్‌బికె సిబ్బందికి తెలియని పరిస్థితి. తెలంగాణ ధాన్యం ధర తగ్గించి కొనుగోలు చేసి, దమ్మపేట నుంచి రూ.2000 కిరాయి, గంగారం చుట్టుపక్కల నుంచి రూ.1500 కిరాయి పెట్టి ధాన్యం తీసుకొచ్చి దళారులు వ్యాపారం చేసుకుంటున్నారు.

చింతలపూడి మండలంలో రైతులు ప్రస్తుతం 1224, సంపత్ స్వర్ణ రెండు రకాలు పండిస్తున్నారు. 1224 రకం ఎకరానికి 38 నుంచి 40 బస్తాల వరకు, సంపత్ స్వర్ణ 30 బస్తాల వరకు దిగుబడి అవుతుందని వ్యవసాయాధికారులు చెబుతున్నారు. మండలంలో ప్రతి ఆర్‌బికె పరిధిలో ఇ క్రాప్ నమోదు చేస్తున్నారు. దీని ప్రకారం దిగుబడి ఎంత అవుతుందో, రైతు ఎన్ని ఎకరాలు సాగు చేశాడో అధికారుల వద్ద పూర్తి సమాచారం ఉంటుంది. కాని తెలంగాణ ధాన్యాన్ని ఏ విధంగా కొనుగోలు చేస్తున్నారో తెలియని పరిస్థితి. పామాయిల్ సాగును కూడా వరి పంట సాగుగా ఇ క్రాప్ చేసినట్లు సమాచారం. దీనిపై ఉన్నతాధికారులు దృష్టి పెట్టాలని పలువురు కోరుతున్నారు.

గ్రంథాలయాల్లో వ్యాసరచన పోటీలు

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

58వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా మంగళవారం ఏలూరు బాలల గ్రంథాలయంలో విద్యార్థులకు డ్రాయింగ్, వ్యాసరచన పోటీలు నిర్వహించారు. వ్యాసరచన పోటీలకు న్యాయ నిర్ణేతగా తెలుగు ఉపాధ్యాయులు పామర్తి రంగారావు వ్యవహరించారు. అనంతరం గ్రంథాలయ ప్రతిజ్ఞ, ర్యాలీ నిర్వహించారు.

మండవల్లి:స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో స్వాతంత్ర సమరయోధుల సంఘటనలపై వ్యాసరచన పోటీలను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో హెచ్ఎం జి.శ్రీనివాస్, లైబ్రేరియన్ వీరభద్ర, విజయకుమారి, గ్రంథాలయ అధికారిని షేక్ పరివిన, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

టి.నరసాపురం : స్థానిక శాఖా గ్రంథాలయంలో విద్యార్థులకు వ్యాసరచన, కుర్చీల ఆటల పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా మెట్టగూడెం మండల ప్రజా పరిషత్ ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయుడు వి.రవికుమార్ మాట్లాడారు.

ద్వారకాతిరుమల : ద్వారకాతిరుమల శాఖా గ్రంథాలయంలో వ్యాసరచన పోటీలు నిర్వహించారు. ఆరు, ఏడు తరగతుల విద్యార్థులకు గ్రంథాలయాల ఉపయోగం గురించి, 8, 9, 10 తరగతుల విద్యార్థులకు తుపాన్ వల్ల కలిగే నష్టాల గురించి వ్యాసరచన పోటీలు నిర్వహించారు. అనంతరం క్విజ్ పోటీలు నిర్వహించారు.

నూజివీడు టౌన్ : నూజివీడు పట్టణంలోని ఎస్ఆర్ఆర్ జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో నూజివీడు ప్రథమ శ్రేణి గ్రంథాలయంలో వ్యాసరచన పోటీలు నిర్వహించారు. ఈ పోటీలకు శారద జూనియర్ కళాశాల డిగ్రీ కళాశాల, వాగ్దేవి జూనియర్ కళాశాల, కళాశాలల విద్యార్థులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి సమరశీల పోరాటాలు

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

ఈ నెల 15, 16 తేదీల్లో ఒంగోలు నగరంలో జరిగిన ఎపి మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయీస్ యూనియన్ (సిఐటియు) రాష్ట్ర మహాసభలో యూనియన్ రాష్ట్ర కమిటీ సభ్యుడుగా జిల్లా కార్యదర్శి ఎ.జాన్‌బాబు ఎన్నికయ్యారు. ఈ మేరకు మంగళవారం మహాసభ విశేషాలు, తీర్మానాల వివరాలను జాన్‌బాబు పత్రికలకు విడుదల చేశారు. పర్మినెంట్ కార్మికులకు 12వ పిఆర్‌సి అమలు చేయాలని, కాంట్రాక్ట్ అవుట్‌సోర్సింగ్ కార్మికులందరినీ పర్మినెంట్ చేయాలని, వర్క్ అవుట్ సోర్సింగ్ విధానాన్ని రద్దు చేయాలని పలు తీర్మానాలను రాష్ట్ర మహాసభ ఏకగ్రీవంగా ఆమోదించిందని తెలిపారు. భవిష్యత్తులో మున్సిపల్ కార్మికుల సమస్యల పరిష్కారానికి సమరశీల పోరాటాలు చేస్తామని తెలిపారు.

రైతుల సంక్షేమమే సహకార సంఘాల ప్రధాన లక్ష్యం

మధ్యాహ్నపువారిగూడెం సొసైటీ చైర్మన్ నాగరాజు

ప్రజాశక్తి - టి.నరసాపురం



మాట్లాడుతున్న సొసైటీ చైర్‌పర్సన్ రవికుమార్

రైతుల సంక్షేమమే సహకార సంఘాల ప్రధాన లక్ష్యమని మధ్యాహ్నపువారిగూడెం సొసైటీ చైర్‌పర్సన్ అడపా నాగరాజు అన్నారు. మండలంలోని మధ్యాహ్నపువారి గూడెంలోని ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘం ఆవరణలో మంగళవారం 72వ అఖిల భారత సహకార వారోత్సవాల సందర్భంగా సొసైటీ చైర్మన్ అడపా నాగరాజు జెండా ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులు సొసైటీలు అందిస్తున్న సేవలను వినియోగించుకోవాలన్నారు. నూజువీడు డివిజనల్ సహకార బ్యాంకు అధికారి రవికుమార్ మాట్లాడుతూ సహకార వారోత్సవాల విశిష్టతను, రైతులకు సొసైటీ అందించే సేవలను వివరించారు. ఈ కార్యక్రమంలో సొసైటీ సిఇఒ జి.భుజంగరావు, నాయకులు, సొసైటీ సిబ్బంది పాల్గొన్నారు.

చెత్తరహిత మండలంగా తీర్చిద్దిదాలి

ముదినేపల్లి ఎంపిపి రామిశెట్టి సత్యనారాయణ

ప్రజాశక్తి - ముదినేపల్లి



ముదినేపల్లి : మాట్లాడుతున్న ఎంపిపి

ముదినేపల్లిని చెత్త రహిత మండలంగా తీర్చిదిద్దేందుకు ప్రతిఒక్కరూ కృషి చేయాలని ఎంపిపి రామిశెట్టి సత్యనారాయణ సూచించారు. మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో మంగళవారం ఒక రోజు శిక్షణ నిర్వహించారు. సర్పంచులకు, ఉప సర్పంచులకు, పంచాయితీ కార్యదర్శులకు, క్లాప్ మిత్రులకు, ఎస్‌హెచ్‌జి, విఒఎలకు థీమ్-5 క్లీన్, గ్రీన్ శిక్షణ తరగతులు నిర్వహించారు. ఎంపిపి రామిశెట్టి సత్యనారాయణ ముఖ్య అతిథిగా విచ్చేసి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాల్సిన బాధ్యత ప్రతిఒక్కరిపై ఉందన్నారు. గ్రామాల్లో ఇళ్ల పరిసరాలను శుభ్రంగా ఉంచేందుకు అందరూ సహకరించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపిడిఒ వై.రామకృష్ణ, డిప్యూటీ ఎంపిడిఒ అశోక్, ఎఒ రమణరావు, అన్ని గ్రామాల సర్పంచులు, ఉప సర్పంచులు, మండల పరిషత్ కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

ముసునూరు :ప్రతి గ్రామాన్ని సుందరవనంగా తీర్చిదిద్దుకోవాలని గ్రామ సర్పంచులకు, పంచాయతీ కార్యదర్శులకు ఎంపిడిఒ పిల్లి ఏసుబాబు సూచించారు. ముసునూరు మండల పరిషత్ కార్యాలయంలో డిప్యూటీ ఎంపిడిఒ బసవరాజు అచ్యుత సత్యనారాయణ ఆధ్వర్యంలో మండలంలోని 16 గ్రామాల పంచాయతీ సర్పంచులకు, కార్యదర్శులకు, ఉప సర్పంచులకు, వార్డు మెంబర్లకు, అధికారులకు, ప్రత్యేక శిక్షణ నిర్వహించారు.

ద్వారకాతిరుమల :స్థానిక మండల పరిషత్ అభివృద్ధి కార్యాలయంలో కార్యాచరణ ప్రణాళిక 2025- 26కు సంబంధించి థీమ్5 గ్రీన్ అండ్ గ్రీన్‌పై ఒకరోజు శిక్షణా కార్యక్రమం బుధవారం నిర్వహించనున్నట్లు ఎంపిడిఒ పివివి.ప్రకాష్ తెలిపారు. ఈ కార్యక్రమానికి సర్పంచులు, ఉప సర్పంచులు, పంచాయతీ కార్యదర్శులు హాజరవుతారని తెలిపారు.

నూజివీడు టౌన్ : పట్టణంలోని ఎంపిడిఒ కార్యాలయ సమావేశ మందిరంలో పరిశుభ్రతపై మంగళవారం ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపిడిఒ చెన్న రాఘవేంద్రనాథ్ మాట్లాడుతూ ప్రతి పల్లె పరిశుభ్రతకు మారుపేరుగా రూపాంతరం చెందాలన్నారు. గ్రీన్ అంబాసిడర్లు ఇంటింటికి పర్యటించి చెత్త సేకరించి డంపింగ్ యార్డులకు తరలించడం ద్వారా సంపదను సృష్టించే ప్రక్రియకు శ్రీకారం చుట్టినట్లు చెప్పారు. గ్రామ సర్పంచులు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

మెనూ సక్రమంగా అమలు చేయాలి

ప్రజాశక్తి - ముసునూరు

ప్రభుత్వ నియమ నిబంధనల ప్రకారం మధ్యాహ్న భోజనం సక్రమంగా అమలు చేయాలని ఎంఇఒ బివిఎస్.సుబ్బారావు చెప్పారు. చింతలవల్లి శివారు గోగులంపాడులో కొత్తూరు మండల ప్రాథమిక ఉన్నత పాఠశాల రికార్డులు, విద్యార్థుల అభ్యసన సామర్థ్యం, ఎస్ఎ వన్ పరీక్షల నిర్వహణ, మధ్యాహ్న భోజనం పరిశీలించారు.

ఘనంగా సర్దార్ వల్లభాయ్ పటేల్ జయంతి వేడుక

ప్రజాశక్తి - ఏలూరు సిటీ

ఐక్యత, సమగ్రత, జాతి నిర్మాణంలో కీలకమైన పాత్ర పోషించిన సర్దార్ వల్లభాయ్ పటేల్ 150వ జయంతి ఉత్సవాలు ఏలూరు నగరంలో ఘనంగా నిర్వహించారు. నగరంలోని ఇండోర్ స్టేడియంలో జరిగిన ఈ కార్యక్రమానికి విద్యార్థులు, యువత, వివిధ సంఘాల ప్రతినిధులు భారీగా హాజరై దేశ సమగ్రతకు సంకల్పబద్ధంగా ముందుకు సాగాలని సందేశం ఇచ్చారు. ముందుగా జాయింట్ కలెక్టర్ అభిషేక్ గౌడ్, అదనపు ఎస్‌పి నక్క సూర్యచంద్రరావు, భారత్ మోర్పా సూపరింటెండెంట్ సుంకర రాము, జెడ్‌పి సిఇఒ శ్రీహరి తదితరులు జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. విద్యార్థుల నృత్యప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. సర్దార్ వల్లభాయ్ పటేల్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. యూనిటీ ర్యాలీని జాయింట్ కలెక్టర్ అభిషేక్ గౌడ్ జెండా ఊపి ప్రారంభించారు.

డాగ్యురే సేవలు అభినందనీయం

భీమడోలు : ఫొటోగ్రఫీ సృష్టికర్త డాగ్యురే సేవలు అభినందనీయమని, ఫొటోగ్రఫీ పలువురికి ఉపాధి కల్పన ఏర్పాటు చేస్తుందని భీమడోలు సర్కిల్ ఫొటోగ్రాఫర్ సంక్షేమ సంఘం అధ్యక్షులు సిహెచ్.ప్రభుచౌదరి అన్నారు. ఆయన ఆధ్వర్యంలో సంఘ సభ్యులు మంగళవారం భీమడోలు సంతపేటలో గల డాగ్యురే, అబ్దుల్ కలాం వేదిక వద్ద డాగ్యురే జయంతి కార్యక్రమాలను నిర్వహించారు. వారి విగ్రహాలకు పూలమాలలు వేసి సత్కరించారు.

ఇళ్లు త్వరగా నిర్మించాలి

ముదినేపల్లి : ప్రభుత్వం ఇచ్చిన స్థలంలో ఇంటి నిర్మాణం త్వరగా చేపట్టాలని తహశీల్దార్ లతీఫ్ పాషా లబ్ధిదారులను కోరారు. ముదినేపల్లి గ్రామ సచివాలయం వద్ద లబ్ధిదారులతో మంగళవారం సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా తహశీల్దార్ మాట్లాడుతూ ముదినేపల్లి గ్రామంలో నివేశన స్థలాలు మంజూరైన లబ్ధిదారులు ఇంకా బేస్ మట్టం కూడా వేయని వారు ఇంటి నిర్మాణం చేయాలని కోరారు. ఇంటి నిర్మాణం చేస్తే గృహ నిర్మాణ బిల్లులు చెల్లింపులు జరుగుతాయన్నారు. ఈ సమావేశంలో ఆర్ఐ రాజశేఖర్, గ్రామ ఉపసర్పంచి ఈడే సుధాకర్, విఆర్ఒ హనుమంతరావు, తదితరులు పాల్గొన్నారు.